సాక్షి ప్రకాశం

బుధవారం । 18 । జనవరి । 2023



పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.

- 8లో..



కానిస్టేబుల్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

మార్కాపురంలో ఈనెల 22న నిర్వహించే కానిస్టేబుల్ పరీక్ష ఏర్పాట్లను ఏఎస్పీ పరిశీలించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29 /18

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు: సెకండరీ గ్రేడ్ టీచర్లను ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ సబ్జక్టు బోధకులను నియమించేందుకు సీనియార్టీ జాబితాలు డీఈవోప్రకాశం.కో.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో బి.విజయభాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పరిశీలన ఉంటుందని, ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా సబ్జక్టుల వారీగా ఉంచారన్నారు. పరిశీలనకు సర్వీస్ రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ధ్రువపత్రాల అనంతరం కౌన్సెలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. అదే విధంగా ఈనెల 14న జరిగిన కౌన్సెలింగ్‌కు హాజరుకాని స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, బయోలాజికల్ సైన్స్, ఇంగ్లిష్, గణితం ఉపాధ్యాయులు, ఫిజికల్ సైన్స్ సబ్జక్టు ఉపాధ్యాయులు ఈనెల 18న సాయంత్రం 3 గంటలకు డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని డీఈవో ఆదేశించారు.

జాతీయ రహదారిపై చుక్కల దుప్పి



చుక్కల దుప్పికి నీరు తాపుతున్న స్థానికులు

మద్దిపాడు: పొలాల్లో తిరుగుతూ జాతీయ రహదారి పైకి చుక్కల దుప్పి ఒకటి తప్పించుకువచ్చి గాయాల పాలైన ఘటన మంగళవారం మధ్యాహ్నం వెంకట్రాజుపాలెం సమీపంలో చోటు చేసుకుంది. వెంకట్రాజుపాలెం సమీపంలోని పొలాల్లో తిరుగుతున్న దుప్పి ఒకటి మధ్యాహ్న సమయంలో జాతీయ రహదారిపైకి వచ్చింది. ఈక్రమంలో లారీలు వాహనాల హారన్ల శబ్దాలతో భయపడి ఫెన్సింగ్ పైనుంచి దూకడానికి ప్రయత్నిస్తూ ఫెన్సింగ్‌లో కొమ్ములు ఇరుక్కుపోయి అచేతనంగా నిలిచి పోయింది. ఈక్రమంలో జాతీయ రహదారి వెంట వెళుతున్న మద్దిపాడు కానిస్టేబుల్ సురేష్ దుప్పి పరిస్థితిని గమనించి స్థానికుల సహాయంతో దుప్పిని బయటకుతీసి ఫారెస్టు డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫోన్ చేయగా వారు వచ్చి చుక్కల దుప్పిని జీప్‌లో తీసుకువెళ్లారు. దుప్పిని అటవీ ప్రాంతంలో వదిలి వేస్తామని వారు తెలిపారు.

నేటి నుంచి రహదారి భద్రతా వారోత్సవాలు

ఒంగోలు: రహదారి భద్రతా వారోత్సవాలు ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు రవాణా శాఖ ఉప కమిషనర్ బి.శ్రీకృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న కలెక్టర్ రహదారి భద్రతకు సంబంధించిన బ్రోచర్లు, కరపత్రాలు ఆవిష్కరిస్తారు. రవాణాశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తారు. 19న రహదారి భద్రతకు సంబంధించి బీమా పాలసీలు, గుడ్ సమ్మారిటన్ చట్టం, మోటారు వాహన చట్టం, నిబంధనలకు సంబంధించి ఒంగోలు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. 20వ తేదీ కలెక్టర్, ఎంపీ, ఎంఎల్ఏ, ఎస్పీ, వాహన డీలర్ల అసోసియేషన్, ఐసీడీఎస్ ఉద్యోగులు, ఆటో రిక్షా సంఘాలు, లారీ యజమానులు, డ్రైవర్ల అసోసియేషన్లు, డ్రైవింగ్ స్కూల్స్, ఆర్టీసీ, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, మున్సిపల్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్, టోల్‌ప్లాజా స్టాఫ్, కాలేజీ విద్యార్థులతో వాకథాన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రతపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారన్నారు.

అనంతరం సాయంత్రం 5 గంటలకు రహదారి భద్రతపై సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 21వ తేదీ ప్రజా రవాణాలో మహిళలు ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు నిర్భయ చట్టం, దిశ చట్టం, అభయం యాప్స్‌కు సంబంధించి అన్ని మహిళా గ్రూపులు, కాలేజీ విద్యార్థులు, వర్కింగ్ ఉమెన్స్, గృహిణులకు క్విస్ కాలేజీలో సమావేశం ఉంటుందన్నారు. 22న గుడ్ సమారిటన్ చట్టాలకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్, పోలీసుస్టేషన్లు, పబ్లిక్ ప్లేసుల్లో వివరాలతో బ్రోచర్లను ప్రదర్శిస్తారన్నారు. 23న రైజ్ కాలేజీలో రోడ్ సేఫ్టీ ఆడిట్‌కు సంబంధించి సింపోజియం, 24న ముగింపు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు రవాణాశాఖ ఉప కమిషనర్ బి.శ్రీకృష్ణవేణి పేర్కొన్నారు.



పొలం వద్ద బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్బీకే సిబ్బంది

ధాన్యం కొనుగోలులో రైతు భరోసా కేంద్రాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారీలు, మిల్లర్లపాలు కానివ్వకుండా పూర్తి పారదర్శకంగా ఆర్‌బీకేల ద్వారా అధికారులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఈ ప్రక్రియ జోరుగా సాగుతోంది. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుల ఖాతాల్లోకి నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లకుండా సొంతూళ్లలోనే అధికారులు ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో కర్షకుల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి.

ధాన్యం కొనుగోలు ముంగిట్లో..

- డిసెంబర్ మూడవ వారంలో ప్రారంభమైన ప్రక్రియ
- కొనుగోలులో ఆర్‌బీకేలదే కీలక పాత్ర
- ఇప్పటి వరకు 81.88 టన్నులు కొనుగోలు
- గ్రేడ్–ఏ రకం రూ.2,060, సాధారణ రకం రూ.2,040 మద్దతు ధర
- తేమ 17 శాతం మించకుండా రైతులు జాగ్రత్త వహించాలి
- జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ పర్యవేక్షణలో కనుగోళ్లు

ఒంగోలు అర్బన్: పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. పండించిన పంటలకు ఒక్క రైతు కూడా నష్టపోకూడదని భావించి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ధాన్యం కనీస మద్దతు ధర ప్రకటించడమే కాకుండా దళారులు, మిల్లర్ల ప్రమేయం లేకుండా నేరుగా ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ గత ఏడాది డిసెంబర్ మూడో వారంలో ప్రారంభమైంది. జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ధాన్యం కొనుగోలు విధానాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సివిల్ సప్లయిస్ అధికారుల పర్యవేక్షణలో కొనుగోళ్లు పక్కాగా జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 19 వేల టన్నుల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించారు. అందులో ఇప్పటి వరకు మూడు కొనుగోలు కేంద్రాల ద్వారా 192 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశారు. అందుకు సంబంధించి 12 మంది రైతులకు రూ.16 లక్షలు ఇవ్వాల్సి ఉండగా రూ.5 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ప్రభుత్వ నిర్దేశించిన 21 రోజుల్లో కచ్చితంగా రైతులకు నగదు చెల్లింపులు జరుగుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పూర్తి పారదర్శకంగా జరుగుతుండడంతో రైతులు కూడా ధాన్యం విక్రయించేందుకు ముందుకు వస్తున్నారు. ప్రస్తుతానికి జిల్లాలో లక్కవరం, తురకపాలెం, విశ్వనాథపురంలలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నారు. రైతులు నష్టపోకుండా ఉండేలా కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోకుండా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం దిగుబడి 69,283 టన్నుల అంచనా ఉంది. సాగర్ కాలువ కింద ఉన్న కొన్ని ప్రాంతాల్లో వరి కోతలు జరుగుతున్నాయి.

కనీస మద్దతు ధరకు విక్రయించే రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేసుకుని ఉండాలి. ధాన్యం వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. 17 శాతం కంటే ఎక్కువ తేమ లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిబంధనల మేరకు ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర గ్రేడ్–ఏ రకానికి రూ.2,060, కామన్ రకానికి రూ.2,040 చొప్పున చెల్లిస్తారు. అలాగే గోతాలను సైతం ప్రభుత్వమే ఏర్పాటు చేసింది.

ప్రక్రియ ఇలా.. ఆర్‌బీకేల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుల వద్ద డిప్యూటీ తహశీల్దారు క్యాడర్ అధికారి కస్టోడియన్‌గా ఉండి ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తారు. ఈ దశ పూర్తి కాగానే సివిల్ సప్లయిస్ డీఎం లాగిన్‌కు కొనుగోలు జరిగిన ధాన్యం వివరాలు వస్తాయి. వెంటనే డీఎం రైతులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్‌చేసి మంజూరు చేస్తారు.

ఆర్‌బీకేలు కీలకం

రైతు భరోసా కేంద్రాలు కొనుగోలు ప్రక్రియలో కీలక భూమిక పోషిస్తున్నాయి. జిల్లాలో 613 ఆర్బీకేలు ఉన్నాయి. గతంలో రైతులు ధాన్యాన్ని విక్రయించేందుకు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అన్నీ విషయాల్లో అడుగడుగునా సహాయ, సహకారాలు అందిస్తున్నారు. రైతులు విత్తనం నాటిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు కావాల్సిన పూర్తి సహకారాన్ని ఆర్‌బీకేలు అందిస్తున్నాయి. అంతేకాకుండా వీటి ద్వారా ధాన్యం విక్రయాలు చాలా సులభంగా సాగుతున్నాయి. రైతులకు వీలైనప్పుడు ఆర్‌బీకేల్లోని నిపుణులు నేరుగా కల్లాల వద్దకు వెళ్లి ధాన్యం నమూనాలు పరిశీలిస్తారు. దీంతో రైతుకు ఎంతో శ్రమ తగ్గి భరోసా కలుగుతోంది. ఈ క్రాప్ బుకింగ్ నమోదులో సాంకేతిక సమస్యలున్నా అధికారులు సరిచేసి మరీ ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



రైతులు నష్టపోకూడదు

రైతులెవరూ పండించిన పంటకు కనీస మద్దతు ధర లేక నష్టపోకూడదని రాష్ట్ర ప్రభుత్వమే రైతు పంటను కొనుగోలు చేస్తుంది. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. ప్రక్రియను వేగవంతం చేసేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఒక్క రూపాయి కూడా నష్టం లేకుండా పటిష్టంగా చర్యలు తీసుకున్నాం. రైతులు కూడా ధాన్యం విక్రయించేందుకు ముందుకు రావాలి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం నిర్దేశించినట్లు 21 రోజుల్లో నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకున్నాం.

– **అభిషిక్త్ కిషోర్**, జాయింట్ కలెక్టర్

నేటి నుంచి ఫేషియల్ అటెండెన్స్

- నెలాఖరు వరకు అధ్యయనం
- సాంకేతిక సమస్యలపై దృష్టి



జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఫేషియల్ అటెండెన్స్ తీసుకుంటున్న ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రయోగాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల్లో బాధ్యతలను, జవాబుదారీతనాన్ని పెంచేలా ప్రభుత్వం ఫేషియల్ అటెండెన్స్ సిస్టంను (ఎఫ్ఆర్ఎస్) మంగళవారం అమలులోకి తెచ్చింది. తొలుత విద్యాశాఖలో దీనిని ఆరు నెలల నుంచి అమలు చేస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వంలోని అన్ని విభాగాల్లో ఈ పద్ధతిని అమలులోకి తీసుకొచ్చింది. తొలి రోజు 27 నుంచి 30 శాతం మంది అధికారులు, సిబ్బంది నమోదు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ విధానం ద్వారా హాజరు వేసుకోవాలంటే ప్రతి ఒక్క ఉద్యోగికి ఆండ్రాయిడ్ ఫోన్ తప్పనిసరి. జిల్లాలోని ఉన్నత పదవుల్లో ఉండే కలెక్టర్, ఎస్పీ మొదలుకొని కింది స్థాయిలో పనిచేసే అటెండర్ వరకు ఇదే పద్ధతి ద్వారా హాజరు వేయాల్సి ఉంటుంది. తొలుత ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఫేషియల్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలనా శాఖకు అనుసంధానం కావాల్సి ఉంది. ఇప్పటికే యాప్‌కు సంబంధించిన విధి విధానాలను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో 21,057 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. తొలి రోజు ఆండ్రాయిడ్ ఫోన్లు ఉన్న వారు కూడా కొంత సాంకేతికపరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాంకేతిక లోపాలు, ఇతర సమస్యలపై ఈ నెలాఖరు వరకు అధ్యయనం చేయనున్నారు.

సమయపాలన, జవాబుదారీతనం



ప్రభుత్వ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన ముఖ హాజరుతో సమయపాలనతో పాటు మరింత జవాబుదారీతనం పెరుగుతుంది. ప్రస్తుతం జిల్లాలో ముఖ హాజరుకు సంబంధించి ఎన్‌రోల్‌మెంట్ జరుగుతోంది. మరో రెండు రోజుల్లో నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేస్తాం. దాదాపుగా ఎటువంటి సాంకేతిక లోపం లేకుండా వెంటనే హాజరు పూర్తవుతుంది. ముఖ హాజరుకు సంబంధించి లొకేషన్ ఉంచడం వలన కేవలం కార్యాలయాల్లోనే హాజరు వేయాల్సి ఉంటుంది. దీంతో ప్రతి ఒక్కరూ నిర్దేశించిన సమయానికి కార్యాలయాలకు రావాలి.

– **ఏఎస్ దినేష్‌కుమార్**, కలెక్టర్

ప్రయోగాత్మకంగా అమలు



రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్‌ను ప్రయోగాత్మకంగా మంగళవారం నుంచి ప్రవేశపెట్టింది. అయితే మొదటి రోజు కాబట్టి కొంత సాంకేతిక లోపాలు ఏర్పడ్డాయి. కొంతమందికి ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేసుకున్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కొంతమందికి ఆండ్రాయిడ్ ఫోన్లు లేవు. అలాంటి వారి విషయంలో ప్రభుత్వానికి పరిస్థితులను ఇప్పటికే వివరించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

– **ఎం.వెంకటేశ్వరరావు**, ఒంగోలు నగర కమిషనర్

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేత వరదా



బాలినేని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు వరదా నాగేశ్వరరావు

ఒంగోలు: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వరదా నాగేశ్వరరావు మంగళవారం స్థానిక ప్రైవేటు అతిథి గృహంలో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డిని కలుసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనను బాలినేని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వరదా నాగేశ్వరరావు గతంలో అర్బన్ బ్యాంక్ ఛైర్మన్‌గా టీడీపీ బలపరిచిన అభ్యర్థి. అప్పట్లో కొద్ది ఓట్ల తేడాతో ఆయన ఓటమి చవిచూశారు. ప్రజారాజ్యం పార్టీలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కూడా పనిచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడనై వైఎస్సార్ సీపీలో చేరినట్లు నాగేశ్వరరావు పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో లభిస్తున్న ఆదరణ, వారిలో కనిపిస్తున్న విశ్వాసం తనను పార్టీలో చేరేందుకు కారణమయ్యాయన్నారు.

పేద ప్రజలకు ఇంతగా సేవ చేసే పార్టీ దేశ చరిత్రలోనే లేదన్నారు. వ్యక్తులను గౌరవించడం అనేది తాను బాలినేని వద్ద చూశానని, ఆ ప్రేమాభిమానాలే వైఎస్సార్‌సీపీలో చేరడానికి కారణాలయ్యాయన్నారు. బాలినేని రాజకీయాల్లో ఉన్నంత వరకు ఆయనతోనే తన ప్రయాణమని, మనస్ఫూర్తిగా తనను పార్టీలోకి ఆహ్వానించినందుకు బాలినేనికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్ర పాలన



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల విగ్రహం ఏర్పాటు
- అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అర్పిస్తున్న సీఎం జగనన్న
- ఆయన బిక్షతోనే నేను మంత్రి స్థాయికి ఎదిగాను
- రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

మేడపి (యర్రగొండపాలెం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితోనే రాష్ట్ర పాలన దిగ్విజయంగా ముందుకు సాగిపోతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. త్రిపురాంతకం మండలంలోని మేడపి అంబేడ్కర్ నగర్ కాలనీలో మంగళవారం ఆయన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ అంబేడ్కర్ కొందరికి సంబంధించిన వ్యక్తి కాదని, దేశ సంపదని, ఆయన విగ్రహం దళిత వాడల్లోనే ఉంటుందనుకుంటే పొరపాటేనని అన్నారు. రాష్ట్రానికి అంబేడ్కర్ స్ఫూర్తిని తెలియచేసేందుకు విజయవాడ నడి బొడ్డున ఉన్న స్వరాజ్ మైదాన్‌లో 125 అడుగుల బాబా సాహెబ్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు నిజమైన నివాళి అర్పిస్తున్నారని అన్నారు. యర్రగొండపాలెంలో 25 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నదే తన కోరికని, ఆయన పెట్టిన బిక్షతోనే తాను మంత్రి స్థాయికి ఎదగ గలిగానని అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో అంబేడ్కర్ భావజాలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, పేద ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు పరచడమే అందుకు కారణమని అన్నారు. సీఎం జగనన్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు ఉన్నత శిఖరాలు అధిష్టించేలా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువులు ప్రవేశపెట్టారని, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారని అన్నారు. ధనికుల పిల్లలు స్కూల్‌కు ఏ విధంగా వెళ్తారో అదే విధంగా పేదల పిల్లలు వెళ్లి చదువుకునేందుకు యూనిఫాం, పుస్తకాలు ఉచితంగా అందచేస్తున్నారని, పిల్లల తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు పరుస్తున్నారని చెప్పారు. మరో పర్యాయం జగనన్నను సీఎంగా చేసుకుందామని ప్రజల హర్షధ్వనుల మధ్య అన్నారు. సంక్షేమ ప్రభుత్వంగా దేశ వ్యాప్తంగా పేరుతెచ్చుకుంటుంటే పచ్చనేతలు ఓర్వలేక విమర్శలకు దిగుతున్నారని, సిగ్గులేకుండా జగనన్న నవరత్నాలను తాము కూడా కొనసాగిస్తామంటున్నారని, అధికారం కోసం వారు ఏం చేయటానికైనా సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ఎం.జాన్‌పాల్, మేడపి, త్రిపురాంతకం సర్పంచ్‌లు జి.ఎల్లమ్మ, పి.వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, త్రిపురాంతకేశ్వరి ట్రస్టు బోర్డు ఛైర్మన్ పద్మజా మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

కొనకనమిట్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని గొట్లగట్టులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు క్రీడాకారుల కేరింతలతో రసవత్తరంగా ఉల్లాసంగా సోమవారం రాత్రి ముగిశాయి. హోరా హోరీగా సాగిన ఫైనల్ పోటీల్లో వైజాగ్ చరణ్, గొట్లగట్టు గుమ్మా శ్రీను టీమ్‌లు తలపడగా వైజాగ్ చరణ్ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు బహుమతులను గుమ్మా శ్రీను, వింజవర్తిపాడు కొక్కెర చిన్నా, నాగంపల్లి కొండా, రెడ్డెంవారిపల్లి, గొట్లగట్టు రాహుల్ జట్లు గెలుచుకున్నాయి. తొలుత ఫైనల్ కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి ఆసక్తిగా పోటీలను తిలకించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. గెలుపొందిన జట్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా వరుసగా రూ.30, రూ.25, రూ.20, రూ.15, రూ.10, రూ.5 వేలను బహుమతుల దాతలు మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లపాటి కాంతారావు, నాగం చినబాలగురవయ్య, మారంరెడ్డి వెంకటస్వామిరెడ్డి అందజేశారు. పోటీలకు రిఫరీలుగా రవీంద్రబాబు, బాలగురవయ్య, ఉప్పుటూరి శ్రీనివాసులు, అచ్చయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ పండగ వేళ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, పోటీల నిర్వాహకులు ఉప సర్పంచ్ గాడి కోటేశ్వరరెడ్డి, గుమ్మా శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోటపాటి వెంకట కొండయ్య, మాజీ సర్పంచ్ నాగం బాలగురవయ్య, మాజీ ఎంపీటీసీ ఉప్పుటూరి పెద వెంకటయ్య, గోనుగుంట్ల శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్లు ఎన్ ప్రసాద్, అనుకు ఏడుకొండలు, పోలసాని నారాయణరెడ్డి, వార్డు సభ్యులు ఉబ్బరపు చినకాశయ్య, కరవర్ల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



మొదటి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

ఉగాది నాటికి 9700 జగనన్న ఇళ్లు పూర్తి

ఒంగోలు అర్బన్: ఉగాది పండుగ నాటికి జగనన్న కాలనీల్లో జిల్లాలో 9700 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే లక్ష్యంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి గృహనిర్మాణ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం మేరకు పూర్తి చేసేలా వేగవంతంగా పనిచేయాలన్నారు. ఈ నెల 18 నుంచి ముహూర్తాలు బాగుంటాయని ప్రజలు విశ్వసిస్తున్నందున ఇళ్ల నిర్మాణాలు కూడా వేగం పుంజుకోవాలన్నారు. తగిన సమయం ఉన్నందున ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ప్రతిరోజు లబ్ధిదారులతో మాట్లాడుతూ వారికి అవసరమైన సహాయం అందించాలన్నారు. ఉన్నతాధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి క్షేత్ర స్థాయి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తయిన నిర్మాణ దశలకు సంబంధించి బిల్లులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దీనిలో హౌసింగ్ పీడీ పేరయ్య, ఈఈ, డీఈఈ, ఏఈఈ పాల్గొన్నారు.


ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో అటెండెన్స్ వేస్తున్న ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇతర ఉద్యోగులు


ఒంగోలులోని ఓ వార్డు సచివాలయంలో హాజరు వేస్తున్న మహిళా ఉద్యోగులు


విద్యాశాఖ కార్యాలయంలో..


తన కార్యాలయంలో అటెండెన్స్ వేస్తున్న ఒంగోలు తహసీల్దార్ మురళి

సరికొత్తగా హాజరు.. లేదు బేజారు!

ఫేషియల్ రికగ్నిషన్ టైమ్ అటెండెన్స్ సిస్టమ్.. సింపుల్‌గా చెప్పాలంటే ఎఫ్ఆర్ఎస్.. ఉద్యోగుల హాజరు నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన విధానం మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు కావడంతో ఉద్యోగులు తమ స్మార్ట్ ఫోన్లలో ఇలా హాజరు వేస్తూ కనిపించారు. - సాక్షి, ఒంగోలు

కానిస్టేబుల్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఏఎస్పీ(క్రైమ్స్) శ్రీధరరావు
- పరీక్ష కేంద్రాల్లో వసతుల పరిశీలన


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏఎస్పీ శ్రీధరరావు

మార్కాపురం: మార్కాపురంలో ఈనెల 22న కానిస్టేబుల్స్ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను అదనపు ఎస్పీ(క్రైమ్) శ్రీధరరావు మంగళవారం పరిశీలించారు. జిల్లాలో ఒంగోలు, మార్కాపురంలో కానిస్టేబుల్ పరీక్ష ఈనెల 22న జరగనుంది. మార్కాపురంలో మొత్తం 21 కేంద్రాల్లో దాదాపు 7,500 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో జార్జి ఇంజినీరింగ్, రెడ్డి మహిళా కళాశాల తదితర పరీక్ష కేంద్రాలను ఏఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష రోజున జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని చెప్పారు.

అధిక ధర వసూలు చేస్తే కఠిన చర్యలు : డీఎస్పీ హెచ్చరిక

22వ తేదీన కానిస్టేబుల్ పరీక్షకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు మార్కాపురం వస్తారని, ఆటో డ్రైవర్లు, లాడ్జి యజమానులు వారి నుంచి ఎక్కువ ధర వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కిషోర్‌కుమార్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు ఆటో డ్రైవర్లు సహకరించాలని సూచించారు. జిరాక్స్ సెంటర్ల యజమానులు తమ షాపులను మూసివేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో సీఐ భీమానాయక్, ఎస్సైలు సుమన్, సువర్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎయిడెడ్ టీచర్ల సర్‌ప్లస్ జాబితా విడుదల చేయాలి

ఒంగోలు: ఎయిడెడ్ టీచర్ల సర్‌ప్లస్ జాబితా విడుదల చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి మంగళవారం విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సురేఖను కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలో 150 ఎయిడెడ్ పాఠశాలల్లో 650 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారిలో ప్రతి పాఠశాల నుంచి జీవో 1 ప్రకారం మిగులుగా తేలిన ఉపాధ్యాయుల జాబితాను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సీనియార్టీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని కోరారు.

గేదె పొడిచి వృద్ధుడు మృతి


మృతి చెందిన ఉప్పుటూరి పాపయ్య

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వీరరాంపురం గ్రామంలో గేదె పొడవడంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వీరరాంపురం గ్రామానికి చెందిన ఉప్పుటూరి పాపయ్య(65) తన గేదెలను మేత కోసం పొలానికి తోలుకెళ్లాడు. ఈ క్రమంలో ఒక గేదె పొడవడంతో రాళ్లపై పడిన పాపయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పాపయ్య మృతి చెందాడు. మృతుడికి ఐదుగురు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కృష్ణపావని తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ హైస్కూల్లో సామగ్రి చోరీ


తరగతి గది తలుపులు పగలగొట్టిన దొంగలు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో సోమవారం అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆఫీసు రూమ్, స్టాఫ్ రూమ్, డిజిటల్ తరగతి గదుల తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు బీరువాల తాళాలు కూడా బద్దలుకొట్టారు. హెచ్‌పీ కంప్యూటర్ మానిటర్, ఐరిష్ ట్యాబ్, సౌండ్ సిస్టమ్‌కు చెందిన మూడు మౌత్‌పీసులు, డీసీఆర్ రూమ్‌లోని సౌండ్ సిస్టమ్‌ను అపహరించినట్లు హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే పాఠశాలలో రెండు తరగతి గదుల్లోని 8 ఫ్యాన్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి తెలిపారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- త్రిపురాంతకం మండలం మేడపి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి సురేష్


త్రిపురాంతకం మండలం మేడపి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి సురేష్

త్రిపురాంతకం: ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికి పనిచేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం మేడపిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మంత్రి సురేష్‌కు ఘన స్వాగతం పలికారు. కరోనా సమయంలో ప్రజల ఇబ్బందులు చూసిన ముఖ్యమంత్రి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల అకౌంట్లలో జమచేశారని వివరించారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించలేదని, నేడు ప్రభుత్వ అధికారులే గడప గడపకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని అన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. అర్హులైన వారందరికీ ప్రతి పథకం అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ప్రభుత్వాలు చూశాం.. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని చూస్తున్నాం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. ఆయా కుటుంబాలకు అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను స్థానికంగా ఉన్న అధికారులచే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పక్కా గృహాలు, నివాస స్థలాలు, పింఛన్లు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని, సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరించాలని సురేష్ ఆదేశించారు. మంత్రి సురేష్‌ను ప్రజలు ఆప్యాయంగా పలకరిస్తూ ఆహ్వానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో మరియదాస్, ఏఓ నీరజ, హౌసింగ్ ఏఈ, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, గ్రామసర్పంచ్ గుమ్మా యల్లమ్మ, ఎంపీటీసీ కృష్ణ, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, పార్టీ నాయకులు దగ్గుల గోపాల్ రెడ్డి, నల్లూరి నాగేశ్వరరావు, గుమ్మ చిన్న వీరయ్య, వెంకట నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ విజేత శ్రీకాకుళం


ప్రథమ బహుమతి అందుకుంటున్న శ్రీకాకుళం జట్టు


మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

ఒంగోలు రూరల్: మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఒంగోలు రూరల్ మండలం కరవది వేదికగా ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించిన జాతీయ మహిళా బీచ్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మంగళవారం రాత్రి నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు తలపడగా శ్రీకాకుళం టీమ్ విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో విశాఖపట్నం, తృతీయ స్థానంలో విజయనగరం, నాలుగో స్థానంలో గుంటూరు, ఐదో స్థానంలో ప్రకాశం, ఆరో స్థానంలో పశ్చిమ గోదావరి జట్లు నిలిచాయి. మాజీ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు శిరిగిరి రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. ఫైనల్ మ్యాచ్‌కు ముందు నిర్వహించిన సభలో డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ కుర్రా భాస్కరరావు, ఉపాధ్యక్షురాలు సుమతి, సీఐటీయూ ప్రెసిడెంట్ కాలం సుబ్బారావు, పారిశ్రామికవేత్త ప్రభాకర్, డాక్టర్ రామారావు, ఒంగోలు విద్యుత్ డీఈ రఘుబాబు, రాష్ట్ర రెఫరీ బోర్డు చైర్మన్ కంచర్ల బాబు మాట్లాడారు. అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. గుంటూరు జిల్లా క్రీడాకారిణి ఆర్.భారతి పుట్టినరోజు వేడుకను అతిథుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. పోటీలకు రెఫరీలుగా రెఫరీ సంఘ చైర్మన్ కె.బాలు, రామకృష్ణ, అప్పలస్వామి, గణపతిరావు, సత్యానారాయణ, బసవయ్య, గోపి, సుమన్ వ్యవహరించారు. నిర్వాహకులు అంచిపోగు వెంకటేశ్వర్లు, గొలిమి శ్రీనివాసరావు, శిరిగిని అంజయ్య, ఆర్.జయకర్, జి.వేణు, కృష్ణచైతన్య, గుట్లపల్లి రవి, రమేష్, మణికంఠ, కోటి, వెంకటేష్, సతీష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తాలూకా సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు, మహిళా కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించారు.

కబడ్డీ విజేతలకు బహుమతులందజేత

చీమకుర్తి: రెండు రోజుల పాటు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీమకుర్తిలో నిర్వహించిన కబడ్డీ స్త్రీ, పురుషుల విభాగంలో విజేతలుగా నిలిచిన జట్లకు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సోమవారం రాత్రి బహుమతులు అందించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో స్త్రీ, పురుషుల విభాగాల్లో నిర్వహించిన పోటీలకు విశేష స్పందన లభించింది. మహిళల విభాగంలో మొదటి స్థానంలో కరేడు, పురుషుల విభాగంలో కనిగిరి, చీమకుర్తి సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలిచి విజేతలుగా నిలిచారు. మహిళల విభాగంలో పాకల, చాకిచర్ల, మార్కాపురం, గజ్జలకొండ వరుసగా రెండో స్థానం నుంచి 5వ స్థానం వరకు విజేతలుగా నిలిచారు. పురుషుల విభాగంలో మోక్షగుండం, మార్కాపురం, చాకిచర్ల జట్లు వరుసగా మూడో స్థానం నుంచి 5వ స్థానం వరకు విజేతలుగా నిలిచారు. వారితో పాటు బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్, బెస్ట్ ఆల్‌రౌండర్ బహుమతులను కూడా శిద్దా రాఘవరావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో రోటరీ గవర్నర్ టీ.రాజశేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి కోటేశ్వరరావు, మార్తల తిరుపతిరెడ్డి, రోటరీక్లబ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి రఘుకిరణ్, శిద్దా సురేష్, మన్నం నాగరాజు, పరాంకుశం శ్రీనివాసమూర్తి, ఏ.వీరారెడ్డి, స్థానిక నిర్వాహకులు పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

నేడు వేమన జయంతి సందర్భంగా పోటీలు

ఒంగోలు: యోగి వేమన జయంతి సందర్భంగా బుధవారం స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో బి.విజయభాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగి వేమన జీవిత చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వం పోటీలు ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గురువారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యోగి వేమన జీవిత చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని డీఈఓ ఆదేశించారు.

పచ్చ నేత మోసంపై వీడియో కలకలం


వీడియోలో మాట్లాడుతున్న రాజా

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన ఇనుము, రియల్ ఎస్టేట్ వ్యాపారి రాజా తెలుగుదేశం పార్టీ నేత చేసిన మోసంపై విడుదల చేసిన వీడియో కలకలం రేపుతోంది. వీడియోలో వ్యాపారి పేర్కొన్న కథనం ప్రకారం.. 2018 వరకు పట్టణంలో ఇనుము, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన రాజా అందులో తీవ్రంగా నష్టపోయాడు. ఆర్థిక ఇబ్బందులు, మానసిక సమస్యలతో ఆయన భార్య 2017లో ఆత్మహత్య చేసుకుంది. ఆ సమయంలో పట్టణానికి చెందిన పట్టణానికి చెందిన టీడీపీ ముఖ్య నేత పంచాయితీ చేసి రాజా ఆస్తులను తీసుకున్నాడు. అప్పుల వాళ్లకు డబ్బు చెల్లిస్తానని సదరు టీడీపీ నేత చెప్పాడు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి లావాదేవీలు జరపక పోగా, తనకు రావాల్సిన రూ.40 లక్షల నగదు, మూడు ఎకరాల స్థలం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, న్యాయం చేయాలని ఎస్పీ, స్థానిక పోలీస్ అధికారులను అభ్యర్థించారు. ఈ వీడియో పట్టణంలో తీవ్ర చర్చాంశనీయమైంది. టీడీపీ ముఖ్య నేతలెవరూ ఈ విషయమై మాట్లాడేందుకు ఇష్టపడటం లేదు.

నమ్మించి మోసం చేశాడు

- కనిగిరి పోలీస్ స్టేషన్ వద్ద యువతి ధర్నా

కనిగిరి రూరల్: ప్రేమించి వివాహం చేసుకుంటానని నమ్మించి, గర్భవతిని చేసి చివరకు మోసం చేశాడంటూ డి.శిరీషా అనే యువతి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఐద్వా మహిళలతో కలిసి ధర్నాకు దిగింది. బాధితుల కథనం ప్రకారం.. బేస్తవారిపేట మండలం శింగరపల్లికి చెందిన శిరీష, కనిగిరి మండలం గురువాజీపేటకు చెందిన ఆర్.రామిరెడ్డికి ఏడాది క్రితం పరిచయమైంది. ఇరువురు రహస్యంగా వివాహం చేసుకుని సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో శిరీషా గర్భం దాల్చడంతో యువకుడు పరారయ్యాడు. దీంతో శిరీషా అనేకమార్లు గురువాజీపేటకు వెళ్లి రామిరెడ్డిని, అతని కుటుంబ సభ్యులను వేడుకుంది. వారు స్పందించకపోవడంతో గత నెలలో ఎస్పీకి, కనిగిరి సీఐకి ఫిర్యాదు చేసింది. దీనిపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఆందోళనకు దిగినట్లు శిరీషా తెలిపింది. విషయం తెలుసుకున్న సీఐ పాపారావు లిఖిత పూర్వకంగా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని బాధితురాలికి సూచించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు బషీరా, ప్రసన్న, సీఐటీయూ నాయకుడు పీసీ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు ఎస్సైల బదిలీ

ఒంగోలు టౌన్: జిల్లాలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ మలికా గర్గ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు దిశ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కె.దీపికను కొనకనమిట్ల పీఎస్‌కు బదిలీ చేశారు. కొనకనమిట్ల ఎస్సై బి.ఫణిభూషణ్‌ను వీఆర్‌కు పంపారు. డీసీఆర్బీ ఎస్సై బి.ప్రేమ్‌కుమార్‌ను తాళ్లూరుకు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న బి.నరసింహారావును వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉంటూ తాలూకా పోలీసు స్టేషన్‌కు అటాచ్ అయిన ఎల్.సంపత్ కుమార్‌ను ముండ్లమూరు పీఎస్‌కు, ముండ్లమూరు ఎస్సై ఎస్.మల్లికార్జునరావును వీఆర్‌కు, వీఆర్‌లో ఉంటూ స్పందన సెల్‌కు అటాచ్ అయిన పి.మహేష్ కుమార్‌ను వెలిగండ్ల పీఎస్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇంటర్వ్యూలు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు అర్బన్ సీడీపీఓ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు ఈ నెల 19న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ కేవీపీ రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గురువారం ఉదయం 9 గంటలకల్లా ఒంగోలు ఆర్డీఓ కార్యాలయానికి రావాలన్నారు. 9 గంటలకు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. ఒంగోలు అర్బన్ సీడీపీఓ పరిధిలో ఒక అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు 12 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.